క్లుప్తంగా

సమర్థవంతంగా పనిచేయాలి



జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎస్‌ఈబీ సీఐలు

ఏలూరు(మెట్రో): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతంగా పనిచేసి అక్రమ మద్యం, ఇతర మాదక ద్రవ్యాలకు అడ్డుకట్టవేయాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. ఏలూరు జిల్లాకు బదిలీ అయిన వారు జిల్లా కలెక్టర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. వీరిలో సుధ (కై కలూరు), పి.గిరిజ సత్య కుమారి (భీమడోలు), పి.వెంకటరమణ (నూజివీడు), డీఎస్ఎస్వీ ప్రసాద్ (చింతలపూడి), వై.పట్టాభిచౌదరి (జంగారెడ్డిగూడెం), ఎం.శ్రీనివాసరావు (డీటీఎఫ్ ఏలూరు), కె.వీరబాబు (ఎస్‌హెచ్‌ఓ పోలవరం), కె.విద్యాసుధాకర్ (ఎస్‌హెచ్‌ఓ, ఏలూరు), సుధాకర్ ఉన్నారు. వీరిని కలెక్టర్‌కు ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ ఎన్.సూర్యచంద్రరావు పరిచయం చేశారు.

రామమూర్తికి ఘన నివాళి



రామమూర్తికి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసన మండలి సభ్యులు, రావు సాహెబ్ గానాల రామమూర్తికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన 132వ జయంతిని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ బజార్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాలాచారి మాట్లాడుతూ సమాజంలో విశ్వబ్రాహ్మణులకు సముచిత స్థానం వచ్చేలా కృషి చేసిన మహనీయుడు రామమూర్తి అని కొనియాడారు. బ్రిటీష్ హయాంలో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఓసీగా ఉన్న విశ్వబ్రాహ్మణులను బీసీల్లోకి చేర్చిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. విశ్వబ్రాహ్మణ జాతిలో ఏకైక ఎమ్మెల్సీ ఆయనే అని అన్నారు. చట్ట సభల్లో విశ్వబ్రాహ్మణులకు ప్రాతినిధ్యానికి విశ్వబ్రాహ్మణులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, ఈదలాడ నాని తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి అన్నపూర్ణ ఫౌండేషన్‌కు విరాళం



విరాళం చెక్కును అందిస్తున్న రాధాకృష్ణారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక నరసింహారావు పేటకు చెందిన చలసాని రాధాకృష్ణారావు శ్రీ సత్యసాయి అన్నపూర్ణ సేవా ఫౌండేషన్‌కు రూ.లక్ష విరాళంగా అందజేశారు. సోమవారం స్థానిక రామకృష్ణాపురం సత్యసాయి సేవా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశిశేఖరరావుకు చెక్కు అందించారు. ఈ సందర్భంగా శశి శేఖరరావు మాట్లాడుతూ సత్యసాయి అన్నపూర్ణ సేవా ఫౌండేషన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు, సహాయకులకు నిత్యం అన్నదానం చేస్తున్నట్టు చెప్పారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో తమ సంస్థ అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన సంవత్సరం నుంచీ రాధాకృష్ణారావు ఏటా రూ.లక్ష చొప్పున ఇప్పటివరకు రూ.9 లక్షలు విరాళంగా అందించారని తెలిపారు. నిత్యాన్నదాన కార్యక్రమం తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు, కొవ్వూరు, కై కలూరు, నిడదవోలు, జంగారెడ్డిగూడెం, సీహెచ్ పోతేపల్లి ఆసుపత్రుల్లోనూ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సంస్థల ఏలూరు సమితి కన్వీనర్ పైడేటి రామారావు, నిత్యాన్నదాన పథకం ఇన్‌చార్జి మొటపర్తి జానకి తదితరులు పాల్గొన్నారు.

అగ్గిపుల్లపై రాముని ప్రతిమ



ఏలూరు (టూటౌన్): అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠను పురస్కరించుకుని ఏలూరుకు చెందిన సూక్ష్మకళాకారుడు మేతర సురేష్ బాబు అగ్గిపుల్లపై శ్రీరాముని ప్రతిమను చిత్రీకరించారు. దేశమంతా శ్రీరాముని సంబరాలు నిర్వహించిన నేపథ్యంలో సురేష్‌బాబు శ్రీరాముని రూపాన్ని చిత్రీకరించి అబ్బురపరిచారు.

నేడు ప్రజా ఆశీర్వాద యాత్ర

పెదపాడు: కొత్తముప్పర్రులో మంగళవారం ఉదయం ప్రజా ఆశీర్వాద యాత్ర ప్రారంభమవుతుందని పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. కొత్తముప్పర్రు నుంచి పాతముప్పర్రు, బాగినీడుపాకలు, వీరమ్మకుంట మీదుగా వెంకటాపురం, రామచంద్రపురం వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు.

రామనామ సంకీర్తనలతో మార్మోగిన నగరం

- ప్రత్యేక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక సంబరం
- నగరంలో భారీ ఊరేగింపు
- అన్నదానాలు, ప్రసాద వితరణలు



రామకోటి ప్రాంగణంలో స్వామి వారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ తదితరులు



కొత్తపేటలో కలశాలు, సారెతో మహిళల ఊరేగింపు



కొత్తపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు



వైఎంహెచ్‌ఏ హాలులో రాముని చిత్రపటానికి పూజ చేస్తున్న హిందూ యువజన సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం ఏలూరు నగరం రామనామ సంకీర్తనలతో మార్మోగింది. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రజలు భక్తిపారవశ్యంలో మునిగితేలారు. ఏలూరు రౌండ్ టేబుల్, హిందూ సంఘాల ఐక్యకార్యాచరణ సమితి, అంబికా గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో రామకోటిలోని శ్రీ రామాలయంలో సాయంత్రం 5 గంటలకు పెద్దవంతెన నుంచి మేళతాళాలు, తీన్మార్ డప్పులు, కోలటాలతో భక్త భజన కార్యక్రమాలతో అయోధ్య రాముని భారీ ఊరేగింపు రామకోటి వరకు నిర్వహించారు. రామకోటి ప్రాంగణంలోని శ్రీరామ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మహా హారతి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ శ్రీరాముడంటే దేశానికే ఆదర్శ పురుషుడని, అటువంటి మహనీయుడు జన్మించిన అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ దేశ వ్యాప్త పండుగ అని అన్నారు. ప్రతి ఒక్కరిపైనా శ్రీరాముని ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భారీగా బాణసంచా పేల్చి భద్రాద్రి రాముని ప్రసాద వితరణ చేశారు. వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వకర్త కారుమూరి సునీల్, పారిశ్రామికవేత్త అంబికా కృష్ణ, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ఆర్యవైశ్య ప్రముఖులు, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధులు పాల్గొన్నారు.

- దక్షిణపు వీధి 11వ డివిజన్‌లో కార్పొరేటర్ కోయ జయగంగ సత్తిబాబు ఆధ్వర్యంలో, చిరంజీవి బస్టాండ్ వద్ద శ్రీ రామాలయంలో వడ్డెరగూడెం అధ్యక్షుడు బత్తుల దుర్గారావు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధనలు ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని, పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కారుమూరి సునీల్, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, మంచెం మైబాబు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అతిథులు పంపిణీ చేశారు.
- వైఎంహెచ్‌ఏ హాలులో సాయంత్రం 4 గంటల నుంచి శ్రీరాముని గీతాలాపనలు, అఖండ దీపారాధన నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు. హిందూ యువజన సంఘం ప్రతినిధులు యర్రా సోమలింగేశ్వరరావు, కేవీ సత్యనారాయణ, మజ్జి కాంతారావు, వేణుగోపాల్ లునాని పాల్గొన్నారు
- పవర్‌పేట కోదండ రామాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీరామ నామ తారక మంత్ర పారాయణం చేశారు. స్వామి వారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు.
- జూట్‌మిల్లు వద్ద ఉన్న ధర్మభేరి ప్రాంగణంలో ఉదయం 7.30 గంటల నుంచి శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం శ్రీ సీతా, లక్ష్మణ, హనుమత్ సహిత శ్రీరామ చంద్రమూర్తికి దర్బారు సేవ, పుష్పయాగం, సహస్ర దీపాలంకరణ అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను వ్యాపారవేత్త నారా శేషు పర్యవేక్షించారు.
- ఏడు ఫౌరీల సెంటర్‌లో ఆదర్శ ఆంజనేయ స్వామి దేవస్థానం, కృష్ణా గోదావరి ట్రాన్స్‌పోర్టు సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విశేష కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం పూజా కార్యక్రమం అనంతరం రామ భజన, ప్రసాద వితరణ చేశారు. అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని భారీ ఎల్ఈడీ స్క్రీన్‌పై భక్తులు వీక్షించారు.
- తూర్పువీధి శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో హరే శ్రీనివాస భక్త బృందం ఆధ్వర్యంలో హరే రామ నామ సంకీర్తన, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. సాయంత్రం ఆలయంలో దీపోత్సవం, ప్రసాద వితరణ చేశారు.
- కొత్తపేట కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు 58 మంది ఇత్తడి పళ్లాల్లో సారెతో, మరో 108 మంది సువాసినీలు కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అర్జి నాగేశ్వరరావు, జనపరెడ్డి ధనుంజయరావు, జనపరెడ్డి కృష్ణ, త్రిపర్ణ రమణ, కోలా భాస్కర రావు, మానేపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో శ్రీరామ హనుమాన్ల వేషధారణలో కళాకారులు



ర్యాలీలో కోలాట ప్రదర్శన చేస్తున్న చిన్నారులు



శ్రీరామనామ సంకీర్తన చేస్తున్న మహిళలు

పాలనలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నాని
- కొత్త రేషన్ కార్డులు, ఆస్తి పన్ను పత్రాలు, ఇళ్ల స్థలాల పొజిషన్ సర్టిఫికెట్ల పంపిణీ



మహిళకు ఇంటి స్థల పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే నాని, ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్ యాదవ్



వన్‌టౌన్‌లో 6వ డివిజన్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్, మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఇంటి వద్దే ప్రభుత్వ సేవలు అందించేలా విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని, ప్రజా సేవలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందువరుసలో ఉంటుందని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం పలువురు లబ్ధిదారులకు కొత్తరేషన్ కార్డులు, ఆస్తి పన్ను పత్రాలు, ఇళ్ల స్థలాల పొజిషన్ సర్టి ఫికెట్లను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ ఎమ్మెల్యే నానితో కలిసి లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. 520 మందికి కొత్తగా రేషన్ కార్డులు, 113 మందికి ఆస్తి పన్నుల పత్రాలు, 66 మందికి ఇళ్ల స్థలాల పొజిషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నగరంలో ఇల్లు లేని ప్రతి పేదవానికీ గూడు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఏలూరు నియోజకవర్గంలో 31 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని, వీటిలో 16 వేలు ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని వివరించారు. టీడీపీ హయాంలో రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇతర సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజులు, నెలలు తరబడి కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా సేవలను ప్రజలకు చేరువ చేసిందన్నారు. ఏలూరు నగరంలో 520 మందికి కొత్త రేషన్ కార్డు, 66 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు అందజేశామన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు వన్‌టౌన్ 8వ డివిజన్ పరిధిలో రూ.65 లక్షల అంచనా వ్యయంతో వన్‌టౌన్ బిర్లాభవన్ సెంటర్ నుంచి బెజవాడ నాగేశ్వరరావు బిల్డింగ్ వరకు చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 44వ డివిజన్‌లో రూ.90 లక్షల నిధులతో గన్‌బజార్ ప్రాంతం కాలేషా హోటల్ నుంచి శివాలయం వరకు రోడ్డు నిర్మించనున్నారు. ఆయా కార్యక్రమాల్లో భాగంగా వన్‌టౌన్ ప్రాంతంలో మహిళలకు ఆరోగ్యశ్రీ కార్డులను ఎమ్మెల్యే నాని, ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్ అందజేశారు. కరోనా మహమ్మారి కారణంగా రెండేళ్లకు పైగా అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడిందని, అనంతరం ఏడాదిన్నర కాలంగా ఏలూరు నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని నాని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, పార్టీ క్లస్టర్–1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి, కార్పొరేటర్ పొలిమేర దాసు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్ వంకదారు ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, ఏలూరు అర్బన్ తహసీల్దార్ బి.సోమశేఖర్, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు హాజరయ్యారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీటీసీ శాంతకుమారి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ట్రాఫిక్ నిబంధనలను అనుసరించి ప్రమాదాలకు తావులేకుండా బస్సులు నడపాలని ఉప రవాణా కమిషనర్ ఎస్ శాంతకుమారి ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. 35వ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఏలూరు ఆర్టీసీ డిపో గ్యారేజ్ ప్రాంగణంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్లకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాంతకుమారి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపే వారికి భారీ జరిమానాలు, జైలు శిక్షలు కూడా విధించే అవకాశం ఉందన్నారు. త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కుటుంబానికి తానే పెద్ద దిక్కు అని గుర్తుంచుకొని వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్వీఆర్ వర ప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు, జిల్లా ట్రాఫిక్ రికార్డ్ బ్యూరో ఎస్సై కె.రాంబాబు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.స్వామి, అజీమ్ర బద్దు, ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, ఆర్టీసీ సిబ్బంది, డ్రైవర్లు కండక్టర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయకేతనం పుస్తకాల పంపిణీ



విజయకేతనం పుస్తకాలు పంపిణీ చేస్తున్న అతిథులు



మాదేపల్లిల్లో విజయకేతనం పుస్తకాలతో ఉపాధ్యాయులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు విజయకేతనం స్టడీ మెటీరియల్ పుస్తకాలను సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, గ్రామానికి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. స్థానిక నాయకుడు అన్నపనేని రవి కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు కాట్రు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, దాతలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదేపల్లి జెడ్పీ స్కూల్లో..

ఏలూరు రూరల్: ప్రత్యేక ప్రణాళిక, శ్రద్ధతో చదివితే ప్రతి విద్యార్థీ 10వ తరగతి ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులవుతారని మాదేపల్లి జెడ్పీ పాఠశాల హెచ్ఎం సుంకర వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం ప్రభుత్వం 10వ తరగతి విద్యార్థులకు విజయకేతనం గైడ్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు మాట్లాడుతూ రోజువారీ నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం విజయకేతనం పుస్తకం చదివి టెస్ట్‌లు రాయడం వల్ల మెరుగైన ఫలితాలను సాధించవచ్చన్నారు. పరీక్షలపై ఆందోళన, భయం ఉన్న బాలబాలికలకు ఈ పుస్తకం ఒక ధైర్యంగా ఉంటుందని చెప్పారు. ఉపాధ్యాయులు ఎస్ శివశంకర్, ఎస్ ఉషశ్రీ, దుర్గ, ఎం అపర్ణ, వెంకటేశ్వరమ్మ, కామాక్షి, యాస్మిన్ పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి



శిక్షణ తరగతిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రణవి

ఏలూరు రూరల్: గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై ముందుగానే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీఓ బి.ప్రణవి ఆదేశించారు. సోమవారం ఏలూరు రూరల్ మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు గ్రామ పంచాయతీ సాధారణ పరిపాలన, ఆర్థిక వ్యవహారాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రణవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు 2024 – 25 ఏడాది అభివృద్ధి పనులపై ముందుగానే గ్రామ సభ నిర్వహించాలన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి, ఫొటోలతో ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఈ ప్రణాళికలపై మండల స్థాయి అధికారులు సమీక్ష చేసి ఆమోదిస్తారని తెలిపారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులు ముందస్తు ప్రణాళికతోనే ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. వార్షిక నిధులు, పంచాయతీ జనరల్ ఫండ్, ఉపాధి పథకం నిధులతో చేపట్టబోయే పనులపై ప్రజలతో చర్చించి ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, ఎంఏఓ జీవనసంధ్య, ఎంఈఓ రంగయ్య, ఏపీఓ కిషోర్, సర్పంచ్‌లు పత్యాల సునీత, డి.భాగ్యశ్రీ, కార్యదర్శులు రవీంద్ర, ప్రసాద్, సుమలత, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.